క్లుప్తంగా

సరస్వతీదేవి సన్నిధిలో ఎంపీ



పూజల్లో పాల్గొన్న రఘునందన్‌రావు

వర్గల్(గజ్వేల్): శరన్నవరాత్రి ఉత్సవాలతో అలరారుతున్న వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రాన్ని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు గురువారం సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. చంద్రశేఖర సిద్ధాంతి పరివారం ఆయనకు వేదాశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేసి, శేషవస్త్రంతో సన్మానించారు. అనంతరం వర్గల్ క్షేత్రంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షల ఎంపీ ల్యాడ్స్ స్కీమ్‌లో భాగంగా మంజూరు చేశారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

రమణారావుకు కీర్తి చక్ర పురస్కారం



అవార్డు అందుకుంటున్న రమణారావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సురవరం ప్రతాప రెడ్డి తెలుగు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ నిత్యానందరావు నుంచి కీర్తిచక్ర పురస్కారం అందుకున్నట్టు ప్రముఖ కార్టూనిస్టు, సీనియర్ జర్నలిస్టు రమణారావు గురువారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో వివిధ రంగాల్లో కృషి చేసిన కవులు, కళాకారులకు ఈ అవార్డులు అందించారన్నారు. ప్రశంసాపత్రం, రూ.5,116 నగదు, శాలువాతో సన్మానించినట్లు తెలిపారు.

డీజే బాక్సులు పెట్టొద్దు

ఏసీపీ సుమన్‌కుమార్



సిద్దిపేటకమాన్: షాపింగ్ మాల్స్, ఇతర దుకాణాల ఎదుట డీజే బాక్సులు పెట్టవద్దని ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ రద్దీ తగ్గించి బతుకమ్మ, దసరా పండగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ పోలీసుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. షాపింగ్ మాల్స్, ఇతర షాపుల నిర్వాహకులు తాత్కాలిక పార్కింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. సుభాష్‌రోడ్డులో ప్రవేశించడానికి ద్విచక్ర వాహనాలకు మాత్రమే అనుమతి ఉందని, ఆటోలు, కార్లకు అనుమతి లేదని తెలిపారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తం



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

చిన్నకోడూరు(సిద్దిపేట): వర్షాలు కురుస్తున్నందున పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ పద్మ సూచించారు. మండల పరిధిలోని అనంతసాగర్, చర్లఅంకిరెడ్డిపల్లి, మల్లారం తదితర గ్రామాల్లో గురువారం పత్తి, వరి పంటలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరి పైరులో పాముపోడు తదితర తెగుళ్లు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఆమె వెంట ఏఓ జయంత్ కుమార్, ఏఈఓలు, రైతులు ఉన్నారు.

నరేందర్‌రెడ్డిని కలిసిన చంద్రం



నరేందర్ రెడ్డిని సన్మానిస్తున్న చంద్రం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ముఖ్యమంత్రి వ్యవహారాల ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం తెలిపారు. హైదరాబాద్‌లో సీఎం కార్యాలయంలో గురువారం కలిసి సన్మానించినట్లు తెలిపారు. పార్టీ కష్ట కాలంలో కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చినట్లు చెప్పారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా నాయకులు ఉన్నారు.

సమయం కేటాయించండి

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్

హుస్నాబాద్: పట్టణ ప్రజలంతా వారంలో రెండు గంటల సమయం స్వచ్ఛతకు కేటాయించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ కోరారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ఎల్లమ్మ చెరువు వద్ద ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్ అనే నినాదంతో గురువారం శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్‌ను స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దడంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాత్యాయని.. కాపాడు తల్లీ

గ్రామాలలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు గురువారం అమ్మవారు కాత్యాయని దేవి అవతారంలో దర్శనమిచ్చారు. దుర్గామాత మండపాలు, ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపాసకులతోపాటు అధిక సంఖ్యలో మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. వర్గల్ శ్రీవిద్యాసరస్వతి క్షేత్రంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.



వర్గల్(గజ్వేల్): శ్రీరాజరాజేశ్వరిగా వర్గల్ సరస్వతీదేవి



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): లలితా త్రిపుర సుందరిగా దర్శనమిస్తున్న కన్యకా పరమేశ్వరి మాత



గజ్వేల్‌రూరల్: 25 వేల గాజుల అలంకరణలో రోహిణీదేవిగా మహంకాళి అమ్మవారు



కొండపాక(గజ్వేల్): అన్నపూర్ణ మాతగా..



హుస్నాబాద్: దుర్గాదేవి మండపంలో పూజలు చేస్తున్న మహిళలు



మిరుదొడ్డి(దుబ్బాక): అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమార్చన



చిన్నకోడూరు(సిద్దిపేట): మల్లారంలో పూజలు చేస్తున్న మహిళలు

సేంద్రియ ఎరువులపై అవగాహన అవసరం

దుబ్బాకటౌన్: ఆధునిక పద్ధతులలో సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన ఉండాలని నవభారత నిర్మాణ సంస్థ కో ఆర్డినేటర్ దాతర్ పల్లి భాస్కర్ అన్నారు. రాయపోల్ మండలం ముంగిస్‌పల్లి, ఆరేపల్లి గ్రామాల్లో పత్తి రైతులకు గురువారం అవగాహన కల్పించారు. వావిలకు కషాయం పిచికారీ చేయడం వల్ల పచ్చదోమ, పెనుబంక, తెల్లదోమ వంటి రసం పీల్చే పురుగులు నశిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో మహేశ్వరి, రవళి, శ్రీకాంత్, కరుణాకర్, రైతులు పాల్గొన్నారు.

వరద నీటి కష్టాలకు చెక్

- వానొస్తే చాలు నిలిచిపోతున్న నీరు
- వరద ప్రభావిత ప్రాంతాలు గుర్తింపు
- డ్రైనేజీల కోసం రూ.8 కోట్లు మంజూరు



హుస్నాబాద్ 3వ వార్డులో నిలిచిపోయిన వరద (ఫైల్)



హుస్నాబాద్: వరద నీటి ముంపునకు ఇక చెక్ పడనుంది. హుస్నాబాద్‌లో వరద నీటి డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వం రూ.8 కోట్లు మంజూరు చేసింది. వానొస్తే చాలు మెయిన్ రోడ్డుతోపాటు పలు వార్డులు వరద నీటిలో మునిగిపోతున్నాయి. దీంతో జనం అతలాకుతలం అవుతున్నారు.

ధ్వంసమైన డ్రైనేజీలు

మురుగు కాలువలు నిండిపోయి కల్వర్టులు జామ్ అవుతున్నాయి. దీంతో వరద నీరంతా రోడ్లపై పొంగి ప్రవహిస్తుంది. నీరు ఇళ్లలోకి కూడా చేరుతుంది. వరద నీరు కాలనీలను ముంచెత్తినప్పుడు జేసీబీల సహాయంతో రోడ్ల వద్ద గండి కొట్టి బయటకు పంపిస్తున్న పరిస్థితి నెలకొంది. ఏళ్ల కాలం నాటి మురుగు కాలువలు ధ్వంసం కావడంతో వరద నీరు వీధుల్లో నిలిచిపోతుంది.

నీరుపోయే దారిలేదు

పట్టణంలో చాలా చోట్ల కుంటలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో వర్షపు నీరు వెళ్లే దారిలేకుండా పోయింది. దీంతో వరద నీరు ఇళ్లలోకి చేరడంతో విలువైన సామగ్రి నీట మునిగి నష్టపోతున్నారు. తీగలకుంటలో వ్యవసాయ మార్కెట్ యార్డ్, పటేల్ కుంటలో పోలీస్ స్టేషన్, టెలిఫోన్ ఎక్ఛేంజ్, పాత తహశీల్దార్ కార్యాలయం(ప్రస్తుతం సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ భవనం నిర్మాణంలో ఉంది) నిర్మించారు. వర్షం వచ్చినప్పుడే తాత్కాలిక సహాయ చర్యలు చేపట్టడం తప్ప శాశ్వత పరిష్కారం లేదు.

వరద నీటికి అడ్డుకట్ట

పట్టణంలోని పలు వార్డుల్లో వరద నీటికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలకు పూనుకుంది. పట్టణంలో వరద ప్రభావిత ప్రాంతాలను అధికారులు గుర్తించారు. మంజూరైన నిధులతో డ్రైనేజీలు నిర్మించి చర్యలు చేపట్టనున్నారు.

సమస్యకు శాశ్వత పరిష్కారం



వరద నీటి కష్టాల నుంచి ప్రజలను విముక్తి చేస్తాం. వరద నీటి డ్రైనేజీల నిర్మాణం కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో ప్రభుత్వం రూ.8 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో అవసరమైన చోట్ల వరద నీరు పోయేందుకు డ్రైనేజీలు నిర్మిస్తాం. అలాగే కొత్త కాలనీల్లోను డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చి శాశ్వత పరిష్కారం చూపుతాం.

\- మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్, హుస్నాబాద్

అంగన్‌వాడీ టీచర్లదే కీలక పాత్ర



అంగన్‌వాడీ టీచర్లకు చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్: తల్లి, పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే అందుకు అంగన్‌వాడీ టీచర్లు కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో గురువారం రాత్రి అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు ప్రభుత్వం ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. సమయానికి పౌష్టికాహారం, మందులు అందజేయాలని సూచించారు. కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం కీలకం

మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్

దుబ్బాకటౌన్: పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పట్టణాలు స్వచ్ఛంగా ఉంటాయని మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్ అన్నారు. స్వచ్ఛతా హి సేవలో భాగంగా గురువారం మున్సిపల్ కార్యాలయంలో తిమ్మాపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి దివ్యశ్రీ, సిబ్బంది అలకనంద, గణేశ్, కొండయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేయొద్దు

మిరుదొడ్డి(దుబ్బాక): మహిళలు పని ఒత్తిడిలో పడి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని ఐకేపీ ఏపీఎం లక్ష్మీ నర్సమ్మ అన్నారు. పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. మహిళా సంఘం సభ్యులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ సమీనా సుల్తానా, సీహెచ్‌ఓ లింగమూర్తి, సీసీలు వరలక్ష్మి, జ్యోతి, వైకుంఠం, వైద్య సిబ్బంది మంజుల, స్వప్న, రవి, సుధీర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో ప్రోత్సాహం

అదనపు డీఆర్‌డీఏ సుధీర్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు, లబ్ధిదారులు

సిద్దిపేటరూరల్: గ్రామగ్రామాన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పడం ద్వారా వ్యాపారులను ప్రోత్సహించాని అదనపు డీఆర్‌డీఏ సుధీర్‌కుమార్ సూచించారు. జిల్లాకు పీఎంఎఫ్ఎంఈ పథకం కింద ఎక్కువ యూనిట్లు మంజూరు చేస్తున్నారని వెల్లడించారు. ఢిల్లీలో ప్రధాన మంత్రి మోదీ వరల్డ్ ఫుడ్ ఇండియా కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పీఎంఎఫ్ఎంఈ పథకం కింద మంజూరైన యూనిట్ల లబ్ధిదారులకు వన్ క్లిక్‌తో వారి ఖాతాల్లో సబ్సిడీని జమచేశారు. అనంతరం లబ్ధిదారులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలోనే అత్యధిక యూనిట్లు మంజూరు చేసిన సిద్దిపేట జిల్లాకు మాత్రమే రాష్ట్రం నుంచి అవకాశం కల్పించారు. కాన్ఫరెన్స్‌లో డీపీఎం వాసుదేవ్, ప్రకాశ్, విద్యాసాగర్, దాకయ్య, ఏపీఎంలు సరిత, రాకేశ్, విజయ నిర్మల, డీఆర్‌పీ వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి స్టీల్ బ్యాంక్ దోహదం

హుస్నాబాద్: ప్లాస్టిక్ వాడకం తగ్గించి ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతోనే స్టీల్ బ్యాంక్‌ను పంపిణీ చేస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల అన్నారు. పొన్నం సత్తయ్య గౌడ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఆమె 20 వార్డుల మహిళా సంఘాలకు 13 రకాల స్టీల్ సామగ్రిని అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, నాయకులు శివయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



స్టీల్ బ్యాంక్‌ను పంపిణీ చేస్తున్న మంజుల

డీఎస్పీ పోస్టుకు అఖిల్ ఎంపిక

సిద్దిపేటజోన్: గ్రూప్–1 ఉద్యోగాల తుది జాబితాలో సిద్దిపేటకు చెందిన నర్రా అఖిల్ డీఎస్పీ పోస్టుకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయుడు నందిని భగవాన్‌రెడ్డి కుమారుడైన ఆయన బుధవారం రాత్రి విడుదలైన ఫలితాల్లో 75వ ర్యాంక్ సాధించారు. అదేవిధంగా పట్టణానికి చెందిన ప్రముఖ పిల్లల వైద్యుడు వీవీ రావు కుమారుడు అరుణ్ చంద్ర 147వ ర్యాంకు సాధించి అసిస్టెంట్ ఆబ్కారీ సూపరింటెండెంట్ పోస్టుకు ఎంపిక అయ్యారు. వారిని కుటుంబ సభ్యులు అభినందించారు.



అఖిల్



అరుణ్ చంద్ర

జమ్మి చెట్టుకు విశిష్ట ప్రాధాన్యం

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్: పురాతన కాలం నుంచి జమ్మిచెట్టుకు విశిష్టమైన ప్రాధాన్యం ఉందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ త్రిశక్తి ఆలయం వద్ద గురువారం ఆయన మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కో–ఆర్డినేటర్ రాఘవరావు, జిల్లా ఇన్‌చార్జి రాజేశ్వర్‌రావుతో కలిసి జమ్మి మొక్క నాటారు. ఆయన మాట్లాడుతూ దసరా రోజున జమ్మి ఆకులను బంగారంగా భావించి పెద్దలకు ఇచ్చి ఆశీర్వాదం పొందుతారన్నారు. ప్రతి గుడివద్ద జమ్మి మొక్క నాటాలని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ చైర్మన్ సంతోష్‌రావు నిర్ణయించడం అభినందనీయం అన్నారు. మాజీ కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్, నరేశ్, ఎల్లేశ్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి శివారులోని మోయతుమ్మెద వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మాత్రం ఇసుక లభించక అవస్థలు పడుతున్నారు. అక్రమార్కులు తోటపల్లి, సమీప గ్రామాలలో ట్రాక్టర్ల ద్వారా తెచ్చి ఖాళీ స్థలాలు, వెంచర్ల వద్ద ఇసుక డంపు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో హైదరాబాద్, సిద్దిపేట, గన్నేరువరం ప్రాంతాలకు భారీ వాహనాలలో తరలిస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక అందేలా చూడాలని కోరారు.

గంజాయి రహిత జిల్లానే ధ్యేయం

త్రీటౌన్ సీఐ విద్యాసాగర్

సిద్దిపేటఅర్బన్: గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషిచేయాలని త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలను అరికట్టడంతో భాగంగా గురువారం సాయంత్రం టీహెచ్ఆర్ నగర్‌లో కిరాణా షాపులు, టీ స్టాల్స్, ఇతర అనుమానాస్పద ప్రాంతాలలో నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తాత్కాలిక ఆనందం కోసం జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్స్ ఎవరైనా వినియోగించినా రవాణా చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది అజయ్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బంగారు బతుకమ్మ ఉయ్యాలో..

తెలంగాణ సంప్రదాయానికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు గ్రామాలు, పట్టణాలలో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజైన గురువారం అట్ల బతుకమ్మను భక్తిశ్రద్ధలతో కొలిచారు. యువతులు, మహిళలు బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ నృత్యాలు చేశారు.



బతుకమ్మ ఆడుతున్న జిల్లా న్యాయమూర్తి సాయి రమాదేవి తదితరులు



హుస్నాబాద్‌రూరల్: స్వశక్తి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల



సిద్దిపేటజోన్: బతుకమ్మను తీసుకువస్తున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, మహిళా ఉద్యోగులు